





PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:39 ఎడిటర్: రాపోలు లింగస్వామి 09-10-2026 శుక్రవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


## మార్కాపురం జెడ్పీ పీఠంపై 'సానికొమ్ము కన్ను

### జెడ్పీ చైర్మన్ రేసులో విజయభాస్కర్‌రెడ్డి.. రాజకీయంగా వ్యూహాత్మక అడుగులు



కనిగిరి, జ్యోతి ప్రభంజనం ప్రతినిధి,అక్టోబర్ 08:నూతనంగా ఏర్పాటు కానున్న మార్కాపురం జిల్లా పరిషత్ (జెడ్పీ) చైర్మన్ పదవిపై కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలానికి చెందిన టీడీపీ నేత సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి ఆసక్తి చూపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లా పునర్విభజన నేపథ్యంలో మార్కాపురం జిల్లా పరిషత్ ఏర్పాటయ్యే అవకాశాలపై చర్చ సాగుతున్న క్రమంలో కొత్త జెడ్పీకి తొలి చైర్మన్‌గా అవకాశం దక్కించుకునేందుకు ఆయన రాజకీయంగా పావులు కదుపుతున్నారనే ప్రచారం స్థానికంగా ఊపందుకుంది. జనరల్ రిజర్వేషన్‌పై ఆశలుమార్కాపురం జెడ్పీ చైర్మన్ పదవి జనరల్ కేటగిరీకి కేటాయించే అవకాశం ఉందన్న ప్రచారం విజయభాస్కర్‌రెడ్డి వర్గాల్లో ఆశలు రేకెత్తిస్తోంది.కొత్త జిల్లా పరిధిలోని నియోజక వర్గాల్లో టీడీపీ రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల బలాబలాలు,స్థానిక నాయకుల ప్రభావం వం టి అంశాలు చైర్మన్ ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రత్యేకించి రెడ్డి సామాజికవర్గానికి ఆయా ప్రాంతాల్లో ఉన్న రాజకీయ ప్రాతినిధ్యం, నాయకుల మధ్య ఉన్న సంబంధాలు కూడా విజయభాస్కర్‌రెడ్డి ప్రయత్నాలకు అనుకూలంగా



మారవచ్చనే చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మద్దతు?విజయభాస్కర్‌రెడ్డి కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి సన్నిహితంగా ఉండే టీడీపీ నేతగా పార్టీ వర్గాల్లో గుర్తింపు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కాపురం జెడ్పీ చైర్మన్ పదవిపై ఆయన ఆసక్తి, స్థానిక రాజకీయ సమీకరణాలపై ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ద్వారా పార్టీ పెద్దల దృష్టికి సమాచారం వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.లోకేష్ దృష్టికి వెళ్లిందా? మార్కాపురం జెడ్పీ చైర్మన్ పదవికి సంబంధించిన రాజకీయ సమీకరణాలు, ఆశావహుల ప్రయత్నాలపై మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా అంశం వెళ్లినట్లు టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే చైర్మన్ పదవి రిజర్వేషన్, జెడ్పీ ఏర్పాటు, పార్టీ అధిష్ఠానం నిర్ణయం వంటి అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాతే రాజకీయ సమీకరణాలు మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది.కొత్త జిల్లా పరిషత్ ఏర్పాటైతే తొలి చైర్మన్ ఎవరనే అంశం సహజంగానే రాజకీయ ప్రాధాన్యత సంతరించుకోనుంది. దీంతో ఇప్పటికే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.ఈ క్రమంలో సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి పేరు కూడా జెడ్పీ చైర్మన్ రేసులో వినిపిస్తుండటం కనిగిరి, మార్కాపురం,గిద్దలూరు , యర్రగొండపాలెంలో రాజకీ య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## ధర్మేంద్ర ప్రధాన్‌కు ఏం జరిగిందో.. ప్రధాని మోదీకి అదే జరుగుతుంది

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని సూచించారు.గురువారం సీఈసీకి వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన నిరసనలో పాల్గొన్న రేవంత్.. బీజేపీ తీరును తీవ్రంగా విమర్శించారు.'మొదట మతాన్ని, భాషను ఉపయోగించుకుని ప్రధాని మోదీ నెగ్గేందుకు ప్రయత్నించారు. ఆ తరువాత ఈడీ, సీబీఐ సంస్థలను ఉపయోగించి గెలిచేందుకు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ఈ ప్రయోగాలు చెల్లవని 13 కోట్ల ఓట్లు తొలగించి మళ్లీ అధికారం చేపట్టాలనుకుంటున్నారు' అని ఆయన మండిపడ్డారు. బ్రిటీషర్స్ సైమన్ కమిషన్ వాడితే, బీజేపీ ఎన్నికల కమిషన్ వాడుతోందని ఆరోపించారు. నాడు భగత్ సింగ్ పోరాటం చేస్తే నేడు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. బలహీన వర్గాల వారి ఓట్లను కాపాడటమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు.ఓట్ల తొలగింపు కాంగ్రెస్ సమస్య కాదని దేశ ప్రజల సమస్య అని చెప్పారు.కేంద్ర ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పంతాలకు పోకుండా వెంటనే స్పందించాలన్నారు. లేకపోతే



ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో ఏం జరిగిందో ప్రధాని మోదీ విషయంలో కూడా అదే జరుగుతుందని హెచ్చరించారు.అక్రమ ఓట్ల తొలగింపు ద్వారా రెండు రకాల పౌరులు ఏర్పడుతున్నారని రేవంత్ వివరించారు.ఓటు ఉన్నవా రు ఓటు లేని వారిని ద్వితీయ పౌరులుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

## తెలంగాణను బీజేపీ టార్గెట్ చేసింది..

హైదరాబాద్, అక్టోబర్ 8: మోదీ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరిస్తుందో దేశ ప్రజలు గమనిస్తున్నారని.. ఇప్పటికైనా దేశ ప్రజలు మేల్కొవాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉండడానికి మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని సీఈసీ జ్ఞానేష్ ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో యథేచ్ఛగా ఓట్ చోరీ జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్నామన్నారు.బిహార్, వెస్ట్ బెంగాల్ తర్వాత తెలంగాణను బీజేపీ ప్రభుత్వం టార్గెట్ చేసిందని మహేశ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ కుమ్మక్కై 92 లక్షల ఓట్లు తొలగించిందని ఆరోపించారు. మోదీ, అమిత్‌షా వల్ల 12 సంవత్సరాల్లో దేశ ప్రజలకు ఎంత మేలు కలిగిందో ఆలోచించాలన్నారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు.

## కరెంటు కోసం అధికారుల కాళ్లపై పడిన రైతు నాయకుడు

రాయపోల్: రైతు పొలంలో పంట పండించేది కేవలం తన కుటుంబం కోసమే కాదు.యావత్ సమాజానికి అన్నం పెట్టేందుకు. అలాంటి రైతు తన పంటను కాపాడుకునేందుకు అవసరమైన కరెంటు కోసం అధికారుల కాళ్లపై పడాల్సిన పరిస్థితులు కాంగ్రెస్ హయాంలో దాపురించాయి.సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతు రక్షణ సమితి అధ్యక్షుడు ఇప్ప దయాకర్ రైతుల తరఫున అధికారులను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. పొలాల్లో పంటలు ఎండిపోతున్నాయి.కరెంటు లేక రైతుల కష్టం వృథా అవుతోంది. వెంటనే విద్యుత్ సరఫరా చేయాలంటూ అధికారుల కాళ్లపై పడి వేడుకున్న దృశ్యం ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేసింది. విత్తనం వేసింది రైతు.పంటను పెంచింది రైతు. నీళ్ల కోసం తపించింది రైతు. ఇప్పుడు కరెంటు కోసం కాళ్లు పట్టుకోవాల్సింది కూడా రైతేనా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కష్టానికి విలువ లేదా? పంట ఎండిపోతే రైతు కన్నీటికి బాధ్యత ఎవరిది? 24 గంటల విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీలు మాటల్లో కాకుండా పొలాల్లో అమలు అయి రైతు పంటను కాపాడాలని అధికారులను విన్నవించారు.

## డ్రైవింగ్ లైసెన్స్‌లో ప్రస్తుత చిరునామా ఉండాల్సిందే..




ఆర్టీఓ కార్యాలయాల వారీగా డ్రైవ్ నిర్వహించి లైసెన్స్‌ల పరిశీలన చేస్తున్నారు. ప్రస్తుత అడ్రస్ లేకపోతే లైసెన్స్ పునరుద్ధరణ సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు. ఆన్‌లైన్‌లోనే అడ్రస్ మార్చుకోవచ్చని వివరించారు .కేంద్ర ప్రభుత్వ పోర్టల్ వాహన్‌లో దరఖాస్తుదారులు చెల్లుబాటు అయ్యే చిరునామా రుజువును సమర్పించాల్సి ఉంటుంది. వాహన్ పోర్టల్ సందర్శించి వివరాలు నమోదు చేయాలి. ప్రస్తుత చిరునామాను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. స్లాట్ బుక్ చేసుకొని పత్రాల ధృవీకరణ కోసం ఆర్టీఓ కార్యాలయం వెళ్లాలి. 2-3 రోజుల్లో అప్‌డేటెడ్ లైసెన్స్ ఇంటి చిరునామాకు చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో దారుణం..

రంగారెడ్డి, అక్టోబర్ 8: జిల్లాలోని చేవెళ్ల బస్టాండ్ ఆవరణలో దారుణ హత్య జరిగింది. ప్రయాణికుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదు కోసం కొంతమంది దుండగులు హత్యకు పాల్పడ్డారు.పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లాలోని చేవేళ్ల బస్టాండ్‌లో దారుణం చోటుచేసుకుంది. అర్ధరాత్రి బస్సు సమయం ముగియడంతో ఓ ప్రయాణికుడు బస్టాండ్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇది గమనించిన నలుగురు దుండగులు.. ఆ ప్రయాణికుడితో మాట కలిపారు. నెమ్మదిగా.. బస్టాండ్ ఆవరణలోని ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి దారుణంగా హత్య చేశారు. అనంతరం ఆ ప్రయాణికుడి వద్ద గల నగదును, సెల్‌ఫోన్‌ను దోచుకుని పరారయ్యారు.తెల్లవారుజామున విధులకు హాజరైన ఆర్టీసీ సిబ్బంది మృతదేహాన్ని గమనించి.. పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హత్య జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. నిందితుల్లో ఒకరిని అరెస్ట్ చేయగా.. మరో ముగ్గురి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా.. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు.

## ఈనెల 10 నుంచి బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్ : ఈనెల 10 నుంచి తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ వెల్లడించారు.గురువారం తెలంగాణ భవన్‌లో బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను ,పాటలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో మహిళా నేతలు బృందాలుగా పర్యటించి సంబరాల్లో పాల్గొంటారని వివరించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ పండగ కు రాష్ట్ర పండగ గా గుర్తింపు నిచ్చి తెలంగాణ మహిళల గౌరవాన్ని విశ్వవ్యాప్తం చేశారని అన్నారు .



రేవంత్ రెడ్డి పాలనలో బతుకమ్మ పండగకు ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రోత్సాహం లేదని ,చివరకు బతుకమ్మ చీరల పంపిణీని కూడా ఆపేశారని ఆరోపించారు.తెలంగాణ సంస్కృతిని,అస్తిత్వాన్ని నిలబెట్టే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రా రెడ్డి ,సత్యవతి రాథోడ్ , ఎమ్మెల్సీ వాణి దేవి , మాజీ ఎంపీ మాలోత్ కవిత,జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి,టీజీవీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీ సాయిచంద్ , జీహెచ్‌ఎంసీ మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ప్రజల నెత్తిన ట్రూ-అప్ భారం

నీటి నిర్వహణలో వైఫల్యం, జలవిద్యుత్తును నిర్లక్ష్యం చేయడం, థర్మల్ ప్లాంట్ల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించకపోవడం, పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌కు తగిన ప్రణాళిక లేకపోవడం-ఇవే నేటి విద్యుత్తు సంక్షోభానికి కారణాలా? తెలంగాణలో విద్యుత్తు పరిస్థితి మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విద్యుత్తు పంపిణీ సంస్థలు సుమారు 7,300 మెగావాట్ల గ్రీన్‌పవర్‌ను కొనుగోలు చేసేందుకు విద్యుత్తు నియంత్రణ మండలి ఆమోదం కోరుతూ పిటిషన్ దాఖలు చేయడం ప్రస్తుత పరిస్థితికి మరో ఉదాహరణగా నిలుస్తున్నది. అయితే అసలు ప్రశ్న ఏందంటే-కేసీఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో పెద్దగా కనిపించని విద్యుత్తు కష్టాలు ఇప్పుడు ఎందుకు కనిపిస్తున్నాయి?రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి సరిపడా విద్యుత్తు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు ఆరు గంటలకు మించి విద్యుత్తు సరఫరా కావడం లేదని,వచ్చిన ఆ కొద్దిపాటి విద్యుత్తు కూడా నిరంతరాయంగా ఉండటం లేదని చెప్తున్నారు. తరచూ ట్రిప్పింగ్, లోడ్ పెరుగడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామిక వేత్తలు తమ విద్యుత్తు అవసరాలకు జనరేటర్లను వాడుతున్నారు. విద్యుత్తు ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు రాత్రంతా పంట పొలాల వద్ద కాపలా కాస్తున్నారు. విద్యుత్తు కోసం రైతులు రోడ్లపైకి రావడం, సబ్‌స్టేషన్లను ముట్టడించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. 24 గంటల ఉచిత విద్యుత్తు ఎక్కడ?బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందించారు. రైతులు తమ పంటలకు అవసరమైన నీటిని బోర్ల ద్వారా అందించుకునేందుకు గత సర్కార్ నిరంతర విద్యుత్తు సరఫరా కల్పించడాన్ని వ్యవసాయ రంగానికి కీలకమైన మద్దతుగా భావించింది. అయితే ఇప్పుడు రైతులు విద్యుత్తు కోసం ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? ఇది కేవలం విద్యుత్తు ఉత్పత్తి సమస్యగా చూడటం సరిపోదు. నీటి నిర్వహణ, విద్యుత్తు ఉత్పత్తి, జలవిద్యుత్తు వినియోగం, థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి, భూగర్భజలాల వినియోగం, పంపింగ్ అవసరాలు, పంపిణీ వ్యవస్థ సామర్థ్యం-ఇవన్నీ పరస్పరం అనుసంధానమైన అంశాలు. శ్రీశైలం నీటిని ఎందుకు వినియోగించలేదు?బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ జెన్‌కో శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటిమట్టం అందుబాటులో ఉన్నప్పుడు కూడా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల జలవిద్యుత్తు కోసం నీటిని వినియోగించారు. నీరు తక్కువ ఉన్నప్పుడు ఖర్చుతో కూడుకున్నదైనా రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని వినియోగించుకుని జలవిద్యుత్తు ఉత్పత్తి చేశారు. జలవిద్యుత్తుకు అందుబాటులో ఉన్నప్పుడు దానిని వినియోగించడం ద్వారా ఖరీదైన ప్రత్యామ్నాయ విద్యుత్తు కొనుగోళ్ల అవసరాన్ని తగ్గించవచ్చు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన నీటిని తరలించేందుకు సహకరిస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. శ్రీశైలం నీటిని తగిన స్థాయిలో వినియోగించి జలవిద్యుత్తు ఉత్పత్తి చేయలేదనే ఆరోపణ కూడా ఉన్నది. మహబూబ్‌నగర్,నల్లగొండ జిల్లాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకుని అవసరమైన కృష్ణా నీటినిఎత్తిపోసి నిల్వ చేయకపోవడం వల్ల కూడా పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందనే వాదన ఉన్నది. దీని ఫలితంగా భూగర్భజలాలు మరింత అడుగంటిపోయి, రైతులు పంటలను కాపాడుకోవడానికి బోరుబావులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీరు భూమిలో లేకపోతే బోర్లు మరింత లోతుకు వెళ్లాలి. ఇదే జరిగితే నీటిని పైకి తోడేందుకు మరింత విద్యుత్తు అవసరం. విద్యుత్తు వినియోగం పెరిగితే పంపిణీ వ్యవస్థపై మరింత భారం పడుతుంది. ఇది ఒక దుష్చక్రంగా మారుతుంది. గోదావరి జలాలు పుష్కలంగా అందుబాటులో ఉన్న సమయంలో వాటిని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మూడు పంప్‌హౌస్‌ల ద్వారా విద్యుత్తు వినియోగ డిమాండ్ లేనప్పుడు ఎత్తిపోసి, రిజర్వాయర్లు,చెరువులను నింపి ఉంచినట్లయితే రైతులు బోర్లపై అంతగా ఆధారపడాల్సిన అవసరం ఉండేది కాదనే వాదన ఉన్నది. నీటిని ముందుగానే నిల్వ చేసుకుని ఉంటే భూగర్భజలాలపై ఒత్తిడి తగ్గేది. బోరుబావుల వినియోగం తగ్గితే వ్యవసాయ పంపింగ్‌కు వినియోగించే విద్యుత్తు కూడా తగ్గే అవకాశం ఉండేది. అంటే నీటి నిర్వహణలో తీసుకునే నిర్ణయాలు చివరికి విద్యుత్తు డిమాండ్‌ను కూడా ప్రభావితం చేస్తాయి. పూర్తి సామర్థ్యంతో ఎందుకు వాడరు?తెలంగాణకు మరో ముఖ్యమైన విద్యుత్తు వనరు థర్మల్ విద్యుత్తు. కేసీఆర్ సర్కార్ విద్యుత్తు అవసరాల కోసం ఏర్పాటు చేసి, ఇప్పటికే అందుబాటులో ఉంచిన థర్మల్ విద్యుత్తు ప్లాంట్లను సక్రమంగా నిర్వహించి, వాటి స్థాపిత సామర్థ్యాన్ని సాధ్యమైనంత సమర్థవంతంగా వినియోగించుకుని ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదు. అందుకు ముఖ్యంగా నాణ్యమైన బొగ్గు నిరంతరాయంగా అందుబాటులో ఉండాలి. నాణ్యత లేని లేదా తగిన ప్రమాణాలు లేని బొగ్గును ఉపయోగించడం వల్ల ప్లాంట్ల సామర్థ్యం తగ్గడం, యంత్రాలపై ఒత్తిడి పెరుగడం, నిర్వహణ సమస్యలు రావడం, విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం పడిపోవడం వంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నది. కనుక థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన బొగ్గు సరఫరా, ప్లాంట్ల సమర్థ నిర్వహణ, అవసరమైన నిర్వహణ పనులను ముందుగానే పూర్తి చేయడం, సాంకేతిక లోపాలను వెంటనే పరిష్కరించడం, ఇవన్నీ విద్యుత్తు ఉత్పత్తి స్థిరత్వానికి కీలకం.

# మాంగళ్య షాపింగ్ మాల్ 34 వ శాఖ గొప్ప ప్రారంభం

నిర్మల్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 08:2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది. ఈ క్రమంలో నిర్మల్ లో శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి భాగ్యశ్రీ ముఖ్య అతిథిగా హాజరై, దీప ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. రిబ్బన్ కటింగ్ అనంతరం నటి భాగ్యశ్రీ





మాట్లాడుతూనిర్మల్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉంది. వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుంది''అని అన్నారు. కార్యక్రమంలో శాసన సభ్యులు పద్మావతి రెడ్డి,మునిసిపాల్ చైర్మన్ కుసుమ వెంకట రత్నం బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నరు మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూనిర్మల్ పార్లమెంట్ సభ్యులు మహేష్ గారు మాట్లాడుతూ నిర్మల్ లో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభించడం ఆనందంగా ఉందని స్థానిక యువతకు ఉపాధి కలుగుతుందని అన్నారు. నమ్మకం విశ్వాసానికి మాంగళ్య ప్రతీక అన్నారు. ప్రజలు ఇక్కడే షాపింగ్ చేయాలన్నారు. శాసన సభ్యులు ఏ మహేశ్వర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడుతూ నిర్మల్ ప్రజలకు మాంగల్య షాపింగ్ మాల్ అదృష్టమని యువతకు ఉపాధి తో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లి షాపింగ్ చేయాల్సిన అవసరం లేకుండానే నాణ్యమైన వస్త్రాలు సరసమైన ధరలకు లభిస్తాయన్నారు. నిర్మల్ జిల్లా గా మారాక అతి పెద్ద గ్రూప్ మాంగళ్య షాపింగ్ మాల్ ఇక్కడ ప్రారంభించడం అభినందనీయమన్నారు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి. "ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యం" అని తెలిపారు. మా స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి,వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నామని పేర్కొన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు,యువత,పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్,అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ మాల్ ప్రారంభంతో నిర్మల్ ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చు. రూ. 99 నుంచి ప్రారంభమై రూ. 1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోంది. నిర్మల్ ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్‌కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని డైరెక్టర్స్ కోరారు.

# పంటలు ఎండిపోతున్నాయి.... కాపాడండి మహాప్రభో

### ట్రాన్స్ కో ఏ ఈ కార్యాలయం ముందు సిపిఐ ధర్నా

నేరడుచర్ల, సూర్యాపేట, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 08:పంటలు చేతికొచ్చే సమయం ఆసన్నమైందని ఇప్పుడు కరెంటు ఎంతో అవసరం అని ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కరెంటు కోతలు విధించడం సరికాదని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు గురువారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ట్రాన్స్కో




ఏ ఈ కార్యాలయం ముందు సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో తీవ్రమైన కరెంటు కోతలు నిరసిస్తూ ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రైతులకు విద్యుత్ సరఫరా చేయాలని అవసరమైతే ఇండస్ట్రీస్ కు కోతలు విధించి ప్రస్తుత తరుణంలో రైతాంగానికి విద్యుత్ సరఫరా చేయాలని పంటలు , చేతికొచ్చే సమయం ఆసన్నమైందని వరి కంకులు పాలు పోసుకుంటున్నాయని ఇప్పుడు విద్యుత్ సరఫరా లేకపోతే వరి పంటకు అవసరమైన నీరు అందకపోతే మొత్తం తాలుగా మారే ప్రమాదం ఏర్పడిందని కనీసం రోజుకు 12 గంటలైనా రైతాంగానికి కరెంటు అందించాలని లేనియెడల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నదని, వ్యవసాయ అధికారుల చేత సర్వే చేయించి ప్రస్తుతం రైతాంగ యొక్క అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా ప్రభుత్వం విద్యుత్ అధికారులు రైతులకు ఇబ్బంది లేకుండా వారికి అవసరమైన మేర విద్యుత్ సరఫరా చేయాలని గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉన్నాయని, మరోపక్క ప్రభుత్వలో యొక్క నిస్సహాయతను కూడా అర్థం చేసుకుంటున్నామని అందువలన కనీసం 10 నుంచి 12:00 కరెంటు ఇవ్వాలని కోరుతున్నామని గతంలో లాగా 24 గంటలు కరెంటు కావాలని కోరడం లేదని హైదరాబాదు లాంటి మహా నగరాలకు అవసరమైతే కార్పొరేట్ నగరాలన్నింటికీ కొన్ని గంటలు కరెంటు కోత విధించి మరొక నెల రోజులు రైతాంగానికి విద్యుత్ సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఇట్టి విషయాన్ని అధికారపక్షంలోని ప్రజాప్రతినిధులు గుర్తించాలని క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలన చేయాలని కేవలం పత్రికా ప్రకటనలకు పరిమితం కావద్దని ఆయన హితవు ఫలికారు ధర్నా కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పరికె భరత్, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి కటికోల వెంకన్న సిపిఐ సీనియర్ నాయకులు బెల్లంకొండ గోవిందు గౌడ్ రైతు సంఘం నాయకులు సోమగాని వెంకటేశ్వర్లు బండి సాంబయ్య సోమగాని పురుషోత్తం శీలం రాంబాబు కన్నా బిక్షం ఎస్ కే సయ్యద్ పాష బత్తిని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు

# కేపీహెచ్‌బీలో అనుటెక్స్ లో సందడి చేసిన నిధి అగర్వాల్

### నిధి అగర్వాల్ చేతుల మీదుగా ప్రారంభం.. ఆకట్టుకునే ప్రారంభ ఆఫర్లు



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 08: కుటుంబ ఫ్యాషన్ విభాగంలో విశ్వసనీయ బ్రాండ్‌గా పేరొందిన అనుటెక్స్ కేపీహెచ్‌బీ



రోడ్ నంబర్ 1లో నూతన షోరూంను ఘనంగా ప్రారంభించింది. సినీ నటి నిధి అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు. 1970లో ప్రారంభమైన అనుటెక్స్ ఐదు దశాబ్దాలకు పైగా నాణ్యత, విశ్వసనీయత, అందుబాటు ధరలకు ప్రాధాన్యమిస్తూ వినియోగదారుల ఆదరణ పొందుతోంది. కుటుంబంలోని ప్రతి ఒక్కరి అవసరాలకు అనుగుణంగా సంప్రదాయ



దుస్తులు, పండుగల కలెక్షన్స్, రోజువారీ వస్త్రాలు తదితర విభాగాల్లో విస్తృత శ్రేణి దుస్తులను అందుబాటులో ఉంచినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం అనుటెక్స్ కుత్బుల్లాపూర్ పరిధిలోని కేపీహెచ్‌బీతో పాటు కొత్తపేట,అల్వాల్,మల్కాజిగిరి,ఉప్పల్, ఏఎస్ రావు నగర్, ఆర్‌సీ పురం,సుచిత్ర ప్రాంతాల్లో షోరూంలను నిర్వహిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్లు ఒక చీర కొనుగోలు చేస్తే అదే ధర గల మరో చీర కేవలం రూ. 1కే రూ. 4,999 విలువైన కొనుగోలుపై ఉచిత వెండి నాణెం రూ. 7,999 విలువైన కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం రూ. 1,499కు పైగా కొనుగోలుపై ఉచిత బహుమతులుకస్టమర్ల నుంచి గత 56 ఏళ్లుగా అందుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపిన అనుటెక్స్ యాజమాన్యం, కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 1లోని నూతన షోరూంను సందర్శించి ప్రారంభోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరింది. శ్రీనివాస్,నాగేష్,రాజశేఖర్ మాట్లాడుతూ అనుటెక్స్ మరింత విస్తరణ దిశగా ముందుకు సాగుతోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# ఉత్తములు

బ్రతికున్న మనిషిని కిందకిలాగడంలో ఉత్తములు,
చనిపోయిన మనిషిని పైకి ఎత్తడంలో ఉత్తములు,
బ్రతికున్నప్పుడు లోపాలు
వెతకడంలో ఉత్తములు,
చనిపోయాక గొప్పలు చెప్పడంలో
ఉత్తములు.
ఎదుగుతున్న మనిషిని చూసి
ఓర్వడంలో ఉత్తములు,
ఎదిగిన మనిషిని చూసి
పొగడడంలో ఉత్తములు,
నడుస్తున్న వాడి దారిలో ముళ్లు
వేయడంలో ఉత్తములు,
పడిపోయిన వాడి కథను చెప్పడంలో ఉత్తములు.
జీవించి ఉన్నవాడికి పలకరింపు కరువే,
చనిపోయినవాడికి మాత్రం కన్నీటి వరదే,
ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడంలో వెనుకడుగే,
చనిపోయాక అన్నదానం చేయడంలో ముందడుగే.
బతికున్నప్పుడు విలువను గుర్తించరు,
కాలం దాటాక జ్ఞాపకాలను వదలరు,
మనిషి ఉన్నప్పుడు మనసును గెలవరు,
మనిషి లేనప్పుడు చిత్రపటాలు పెడతారు.
ప్రాణం ఉన్నప్పుడు పరామర్శించరు,
ప్రాణం పోయాక పూలదండలు వేస్తారు,
కన్నీరు ఉన్నప్పుడు తుడవడానికి రారు,
కన్నీరు లేనప్పుడు కన్నీళ్లు కారుస్తారు.
ఇదేనా మనిషి గొప్పతనం?
ఇదేనా మనసు చెప్పే మానవత్వం?
బ్రతికున్నవాడిని బ్రతికించడమే గొప్పతనం,
బ్రతికున్నప్పుడే ప్రేమించడమే నిజమైన ఉత్తమత్వం.



రచన : ఆర్.కె.రెడ్డి గోగులపల్లి, నెల్లూరు జిల్లా.

# బిగ్‌బాస్కెట్ రైడర్ల పేఅవుట్ పెంచాలి

**:ఎల్.బి.నగర్ శాసనసభ్యులు.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**

ఎల్ బీ నగర్ నియోజకవర్గం గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని గడ్డిఅన్నారం చౌరస్తా వద్ద బిగ్ బాస్కెట్ రైడర్లు చేస్తున్న ఆందోళన కార్యక్రమంలో సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా బిగ్ బాస్కెట్ రైడర్లు పలు సమస్యలు సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా బిగ్‌బాస్కెట్ రైడర్ల పేఅవుట్‌ను పాత విధానంలో కొనసాగించాలని,బిగ్‌బాస్కెట్‌లో పనిచేస్తున్న డెలివరీ రైడర్లు ప్రతిరోజూ సుమారు 14 నుంచి 16 గంటల వరకు కష్టపడి పనిచేస్తున్నప్పటికీ,వారి శ్రమకు తగిన పారితోషికం అందడం లేదని రైడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఒక్కో ఆర్డర్‌కు రూ.25 వరకు పేఅవుట్ చెల్లించేవారని, ప్రస్తుతం దానిని రూ.15కు తగ్గించారని వారు తెలిపారు.పేఅవుట్‌ను తిరిగి పెంచాలని రైడర్లు కోరినప్పటికీ, వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకుండా సుమారు 50 మంది రైడర్ల ఐడీలను బ్లాక్ చేసినట్లు వారు పేర్కొన్నారు.డెలివరీ రైడర్లు ప్రతిరోజూ ఎండ, వర్షం, ట్రాఫిక్‌ను ఎదుర్కొంటూ గంటల తరబడి పనిచేస్తున్న నేపథ్యంలో వారి జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని పేఅవుట్‌ను తగ్గించకుండా గతంలో అమలు చేసిన విధంగానే ఒక్కో ఆర్డర్‌కు కనీస బేస్ పేఅవుట్‌ను రూ.25గా కొనసాగించాలని కోరారు.అలాగే బ్లాక్ చేసిన రైడర్ల ఐడీలను వెంటనే పునరుద్ధరించి వారి సమస్యలను సంస్థ యాజమాన్యం సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం సుధీర్ రెడ్డి గారు అట్టి స్టోర్ ఇంచార్జి పాషా



గారిని పిలిపించి రైడర్ల సమస్యలు పరిష్కారం చేయాలనీ తెలిపారు.ఇంచార్జి మాట్లాడుతూ ఇట్టి సమస్యలను పైస్థాయి వారి దృష్టికి తీసుకొనివెళ్తామని అన్నారు. అనంతరం సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ రైడర్ల సమస్యలు పై స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,డివిజన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్,చంద్రశేఖర్ రెడ్డి,గండి సన్నీ యాదవ్,రమణారెడ్డి,శివరాం తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మరాత

నా బిడ్డ తలరాత రాసే వరం
బ్రహ్మ నాకొకసారి ఇస్తే,
కష్టాల నీడే పడకూడదని
నేనెప్పుడూ కోరుకోను...



కన్నీటి రుచే తెలియకుండా
కళ్లను పెంచాలని అనుకోను,
పడిపోవడం తెలియని అడుగులకు
గెలుపు విలువ నేర్పలేను...
జీవితం పూలబాట కాదని
ముళ్లబాటలో నడిపించాలి,
ప్రతి గాయం ఒక గుణపాఠమై
ప్రతి ఓటమి ఓ పాఠమై నిలవాలి...
కష్టాలు ఎదురైన ప్రతిసారీ
కుంగిపోకుండా నిలబడాలి,
విధి విసిరిన రాళ్లతోనే
విజయ శిఖరం కట్టాలి...
వేదన ఎదురైతే విలపించకుండా
దాని వెనుక అర్థం వెతకాలి,
తలుపులు మూసిన కాలానికీ
తన దారిని తానే వెతకాలి...
అదృష్టం కోసం ఎదురు చూడకుండా
ఆలోచనతో అడుగు వేయాలి,
సమస్యను శాపంగా చూడకుండా
సాధనగా మార్చుకోవాలి...
ధనం కంటే మంచి బుద్ధిని,
గెలుపు కంటే మంచి గుణాన్ని,
బలంతో పాటు ఓర్పును,
తెలివితో పాటు మానవత్వాన్ని ఇవ్వాలి...
నా బిడ్డ తలరాతలో
సుఖాలనే రాయాలని కాదు,
కష్టాలను జయించే గుండెను రాసి
జీవితాన్ని గెలిచే జ్ఞానాన్ని ప్రసాదించాలి...
రచన : కె.మురళీ మోహన్ రాజు,
నెల్లూరు.చరవాణి : 9866179385

# శిరిడీ సాయిబాబా ఆలయంలో అన్నదానం, వైద్య సేవలకు రూ.2 లక్షల విరాళం

ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 08:శిరిడీ సాయిబాబా ఆశీస్సులతో నేడు పవిత్రమైన శిరిడీ సాయిబాబా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో అన్నదానం, వైద్య సేవల కోసం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తన కుటుంబ సభ్యులతో కలిసి రూ.2,00,000 విరాళంగా అందజేశారు.అనంతరం శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్, శిరిడీ సీఈఓ గోరక్ష్ గాడిల్కర్ వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం, సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదానం, వైద్య సేవలకు తమ వంతు



సహకారం అందించడం ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మికంగా సంతృప్తినిచ్చిన సందర్భమని పేర్కొన్నారు.సాయిబాబా కృప, ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేయాలని, సేవా భావం,



మానవత్వం, కరుణతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అనంతరం ప్లాస్టిక్ వాడొద్దు అని జూట్ బ్యాగులను వాడాలి అనే ఉద్దేశంతో జూడ్ బ్యాగులను ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది అనంతరం మీడియా తో ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ సేవే సాయిసేవ.. మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం తమకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి ఉప్పల స్వప్న, కుమారుడు సాయి కిరణ్, కోడలు శార్వరి, చిన్న కుమారుడు సాయి తేజ, చిన్న కోడలు వైష్ణవి పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టీఐ వారోత్సవాలు నిర్వహించాలి

**అక్టోబర్ 12ను పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార వారోత్సవాలు**

**ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలి**

**దరఖాస్తుదారులకు సకాలంలో సమాచారం అందేలా ఆదేశాలు ఇవ్వాలని వినతి**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 08:తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 12ను పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ కార్యాలయాల్లో "సమాచార హక్కు వారోత్సవాలు నిర్వహించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి



వినతిపత్రం అందజేశారు.సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడంతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో చట్టం అమలు తీరుపై అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా ఆర్‌టీఐ వారోత్సవాలను నిర్వహించాలని సమితి ప్రతినిధులు కోరారు.ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలిరాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డులను పూర్తి వివరాలతో, ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ఏర్పాటు చేసి సక్రమంగా నిర్వహించాలని వినతిపత్రంలో కోరారు. సమాచార హక్కు చట్టం కింద ప్రజలకు అందుబాటులో ఉన్న హక్కులు, దరఖాస్తు విధానం, సంబంధిత అధికారుల వివరాలు తదితర సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుదారులకు సకాలంలో సమాచారం అందాలిసమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వ కార్యాలయాలకు దరఖాస్తు చేసుకున్న ప్రజలకు చట్టబద్ధమైన గడువులోగా సమాచారం అందేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రజలు కోరిన సమాచారాన్ని పారదర్శకంగా, నిబంధనల ప్రకారం అందించడం ద్వారా ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనం మరింత బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు.ప్రధాన కార్యదర్శికి వినతిపత్రంఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సమాచార హక్కు వికాస సమితి ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొదుమూరి దయాకర్ రావు, బానోతు హరి నాయక్, అప్పన్న వంశీ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి డోలా

**నర్సింగోలులో 'మీ భూమి?మీ హక్కు' కార్యక్రమం.. ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష**

ప్రకాశం జిల్లా జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 8:ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలం నర్సింగోలులో



శుక్రవారం జరగనున్న 'మీ భూమి?మీ హక్కు కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పరిశీలించారు.నర్సింగోలులో ఏర్పాటు చేస్తున్న సభా వేదిక, ప్రజా వేదికలు, పార్కింగ్, ప్రజల రాకపోకలు, ఇతర మౌలిక వసతులను ఆయన పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఒంగోలు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు శ్రీ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మ్యారిటైం బోర్డు చైర్మన్ శ్రీ దామచర్ల సత్య, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీ పెందుర్తి వెంకటేష్ తదితరులు పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, రైతులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కొండపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త శ్రీ కనపర్తి మనోజ్ కుమార్, సింగరాయకొండ మండల మాజీ అధ్యక్షులు ఐనాబత్తిన రాజేష్, జరుగుమల్లి మండల మాజీ అధ్యక్షులు గూడా శశిభూషణ్, కొండపి మండల మాజీ అధ్యక్షులు



విశ్వం, కొండపి మండల నాయకులు కట్ట రాము, పొన్నలూరు మండల నాయకులు పత్తిపాటి మాధవరావు, మిడసల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నర్సింగోలులో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# డా వేము వందనంకు జాతీయ కళా రత్న పురస్కారం

రాజేంద్ర నగర్ అక్టోబర్ 08/జ్యోతి ప్రభంజనం:ఎంవిఆర్ కల్చరల్



అకాడమీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్యాత్మిక సేవా సంస్థ, ఎల్ సి యి ఎస్ ఫౌండేషన్ వేడుకలలో భవాని కాలని రాజేంద్రనగర్ కి చెందిన శతాధిక పురస్కారాల గ్రహీత గత 50 సంవత్సరాలు పైబడివంద నాటికలు, నాటకాల్లో నటించి, 30పైగా దర్శకత్వం వహించిన రచయిత, నటుడు, దర్శకులు డా వేము వందనం కు ప్రతిష్టాత్మక పురస్కారం జాతీయ కళా రత్న సాహితీ వేత్త, విశ్రాంతి డైరెక్టర్ మైన్స్,డావిడి రాజగోపాల్,సంగీత సామ్రాట్ శ్రీచరత్ చంద్రనట సార్వ భౌమ శ్రీ పుచ్చా సాంబ శివారెడ్డి, నాటిక కళా రత్న శ్రీ బి వి కాటమరాజు, జూనియర్ షణ్ముఖి శ్రీ వల్లూరి శ్రీహరి రావు, విలక్షణ నటుడు శ్రీ కూకట్పల్లి పోలయ్య, సుమధుర గాయకుల శ్రీ అరవారవీంద్ర బాబుల నుండి అందుకున్నారు. డా వేము కు ఇది 126వ అవార్డని,తనను జాతీయ స్థాయిలో ఎన్నిక చేసినందుకు ఉభయ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు డా కె బుచ్చేశ్వర రావు, డా కె రవి బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్ శుభారంభం

**దసరా, దీపావళి పర్వదినాల కోసం సరికొత్త కలెక్షన్లు.. కుటుంబంలోని అన్ని తరాల వారికి ప్రత్యేక వస్త్రాలు**

జ్యోతి ప్రభంజనం, హైదరాబాద్, ప్రతినిధి, అక్టోబర్ 08:హైదరాబాద్ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో బాచుపల్లి?మియాపూర్ రోడ్డులోని అమీన్‌పూర్‌లో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ తన 40వ స్టోర్‌ను గురువారం ఘనంగా ప్రారంభించింది. దసరా, దీపావళి పర్వదినాలతో పాటు వివాహాది శుభకార్యాలను దృష్టిలో ఉంచుకుని కుటుంబంలోని అన్ని తరాల వారి అభిరుచులకు అనుగుణంగా విభిన్న రకాల వస్త్రాలను ఈ నూతన స్టోర్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు.ప్రముఖ నటి వైష్ణవి చైతన్య జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేయడం ద్వారా స్టోర్‌ను ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో షాపింగ్‌ప్రియులు హాజరై సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ యాజమాన్యానికి



అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వైష్ణవి చైతన్య మాట్లాడుతూ బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్‌ను తన చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని కుటుంబ సభ్యుల అభిరుచులకు అనుగుణంగా విభిన్న రకాల వస్త్రాలు ఒకే చోట అందుబాటులో ఉండటం ప్రత్యేకత అన్నారు. బాచుపల్లి, మియాపూర్, అమీన్‌పూర్ ప్రాంతాల ప్రజలు ఈ సరికొత్త స్టోర్‌ను ఆదరించాలని ఆమె ఆకాంక్షించారు.ఛైర్‌పర్సన్, హోల్‌టైమ్ డైరెక్టర్ శ్రీ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హైదరాబాద్ విశ్వనగరంగా విస్తరిస్తున్న క్రమంలో బాచుపల్లి ప్రాంతంలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్‌ను ప్రారంభించడం ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో కుటుంబాలు నివసిస్తున్నందున వారి పర్వదినాలు, వివాహ వేడుకలు, ప్రత్యేక సందర్భాలకు అవసరమైన వస్త్రాలను అందించేందుకు ఈ స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మేనేజింగ్ డైరెక్టర్ శీర్ణ రాజమౌళి మాట్లాడుతూ దసరా, దీపావళి పర్వదినాలు, వివాహ వేడుకలతో పాటు కుటుంబంలోని ప్రతి ఒక్కరి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన, ఆకర్షణీయమైన వస్త్రాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వినియోగదారులకు సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభూతిని అందించడమే తమ



లక్ష్యమన్నారు.హోల్‌టైమ్ డైరెక్టర్ శ్రీ తిరువీధుల ప్రసాదరావు మాట్లాడుతూ.. సంప్రదాయాన్ని ప్రతిబింబించే పట్టుచీరల నుంచి పండగ చీరలు, క్యాజువల్ వేర్ వరకు కుటుంబంలోని అన్ని తరాల వారిని ఆకట్టుకునే విస్తృత శ్రేణి వస్త్రాలు తమ 40వ స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రత్యేక ఆకర్షణగా దసరా?దీపావళి కలెక్షన్లుపవిత్ర దసరా, దీపావళి పర్వదినాలు, వివాహాది శుభకార్యాలను పురస్కరించుకుని బాచుపల్లి సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌లో ప్రత్యేక కలెక్షన్లను అందుబాటులో ఉంచారు.మహిళల కోసం:కంచి పట్టుచీరలు, ఫ్యాన్సీ చీరలు, మాస్టర్ వీవర్స్ రూపొందించిన ప్రత్యేక డిజైన్లు, పెళ్లికుమార్తెల కోసం సంప్రదాయ వస్త్రాలు తదితర విభిన్న కలెక్షన్లు.పురుషుల కోసం:డిజైనర్ కుర్తాలు, సంప్రదాయ ఎత్నిక్ వేర్, ఫార్మల్ సూట్స్, ఆధునిక క్యాజువల్ వేర్ తదితర ఫ్యాషన్ కలెక్షన్లు.చిన్నారుల



కోసం:పండగ వాతావరణానికి అనుగుణంగా ఆకట్టుకునే రంగులు, డిజైన్లతో ట్రెండీ ఫెస్టివల్ సూట్స్ అందుబాటులో ఉన్నాయి.బాచుపల్లి మియాపూర్ రోడ్డులోని అమీన్‌పూర్‌లో ప్రారంభమైన సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్‌కు విచ్చేసి దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక షాపింగ్ అనుభూతిని పొందాలని, ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం షాపింగ్‌ప్రియులకు ఆహ్వానం పలికింది.

# నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలి

**- గంజాయి వినియోగదారులను గుర్తించాలి**

**- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచన**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):నాణ్యమైన దర్యాప్తుతో




నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టడంతో పాటుగా గంజాయి వినియోగదారులను గుర్తించి వారిని డి-అడిక్షన్ సెంటర్ కు తరలించాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నేర పరిస్థితులు పెండింగ్ కేసులు కేసుల దర్యాప్తు పురోగతి తదితర అంశాలపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించి కఠిన సేవ, సేవ, ఉత్తమ సేవ శౌర్య పతకాలు పొందిన పోలీసు అధికారులు సిబ్బందికి జిల్లా ఎస్పీ పతకాలను అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో అంకితభావం క్రమశిక్షణతో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం నేర సమీక్షలో ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నేరస్తులకు శిక్ష పడేలా చేసి బాధితులకు న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో జాప్యం నిర్లక్ష్యాన్ని సహించేది లేదని బాధ్యతారహితంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు బాలికలు చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని భరోసా కేంద్రం షీ-టీమ్స్ ద్వారా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళలపై నేరాలు పోక్సో ఎస్సీ ఎస్టీ కేసులు మిస్సింగ్ కేసులతో పాటు రౌడీ షీట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా విక్రయం వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గంజాయి వినియోగానికి అలవాటు పడిన వ్యక్తులను గుర్తించి వైద్యుల సూచనల మేరకు డి-అడిక్షన్ సెంటర్లకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువత విద్యార్థులు ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా విక్రయానికి సంబంధించిన హాట్‌స్పాట్లను గుర్తించి నిరంతరం నిఘా కొనసాగించాలని అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. సైబర్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు సీసీటీఎన్ఎస్ 2.0లో పెండింగ్ వివరాలను సకాలంలో నమోదు చేయాలని నాట్ గ్రిడ్ గాండీవ వెబ్ అప్లికేషన్ల వినియోగాన్ని మరింత పెంచాలని అధికారులకు సూచించారు. జిల్లాలో సీసీటీవీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసి కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. డయల్-112కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు అవసరమైన



సహాయం అందించాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ర్యాష్ డ్రైవింగ్ తదితర ఉల్లంఘనలపై నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని నేరాల నియంత్రణతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్‌తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి సూచించారు. రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 2026 జనవరి 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు మొత్తం 370 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని వీటిలో 164 ప్రమాదాలు ప్రాణాంతకమైనవిగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రమాదాల్లో 176 మంది మృతి చెందగా 23 మంది తీవ్రంగా 344 మంది స్వల్పంగా గాయపడినట్లు వివరించారు. నమోదైన 370 ప్రమాదాల్లో 369 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 99.4 శాతం కేసుల్లో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రహదారుల వారీగా ప్రమాదాల వివరాలను పరిశీలిస్తూ రాష్ట్ర రహదారులపై 79, ప్రధాన జిల్లా రహదారులపై 4, ఇతర జిల్లా రహదారులపై 32, జాతీయ రహదారులపై 67 ప్రమాదాలు జరిగినట్లు అధికారులు వివరించారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత రహదారి సంస్థల ద్వారా అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యతతో చేపట్టాలని ప్రమాదాలకు కారణమవుతున్న మలుపులు బ్లాక్‌స్పాట్లు రహదారి లోపాలను గుర్తించి సకాలంలో సరిచేయాలని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, వీధి దీపాలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 7 కేసులను సీసీ కెమెరాలు సాంకేతిక ఆధారాలు ఇతర సమాచారాన్ని వినియోగించి త్వరితగతిన ఛేదించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.



ప్రతి ప్రాణాంతక ప్రమాదానికి సంబంధించి కారణాలను విశ్లేషించి సంబంధిత రహదారి సంస్థలు రవాణా శాఖకు అవసరమైన సమాచారం అందించి పునరావృత ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.పోలీస్ రవాణా ఆర్అండ్‌బీ పంచాయతీరాజ్ జాతీయ రహదారుల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రమాదాల నివారణకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని డీఆర్వో పద్మావతి ఆదేశించారు. రహదారి భద్రతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాలపై విశ్లేషణ ఆధారంగా అవసరమైన శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమీక్షలో జిల్లా రవాణా అధికారి భూషిత్ రెడ్డి, డీఆర్ఎం జి.బాలాజీ, డీహెచ్ఎంఓ తుకారాం రాథోడ్, ఆర్అండ్‌బీ ఈఈ, ట్రాఫిక్ ఎస్ఐ, సీ సెక్షన్ సిబ్బంది సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకు ప్రతిఫలం.. రాపోలు లింగస్వామికి కళా సేవా ప్రతిభ అవార్డు-2026

**సమాజ సేవలో విశేష కృషికి ఘన గుర్తింపు**

**సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్తగా చేస్తున్న సేవలకు సత్కారం**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 08:ప్రజా సమస్యలపై స్పందిస్తూ, సమాజ సేవలో నిరంతరం తన వంతు కృషి చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్,ప్రముఖ ఆర్ టి ఐ కార్యకర్త, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత,సామాజిక కార్యకర్త రాపోలు లింగస్వామిని ప్రతిష్టాత్మక కళా సేవా ప్రతిభ అవార్డు?2026 వరించింది. ఆయన చేస్తున్న సామాజిక సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు.ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో కళా సేవా ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న



పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా అవార్డులతో సత్కరించారు.ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు ప్రదానంకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ రచయిత, వ్యాఖ్యాత డాక్టర్ రామకృష్ణ చంద్రమౌళి, సినీ నటుడు డాక్టర్ చింతకుంట మాణిక్ రావు చేతుల మీదుగా రాపోలు లింగస్వామికి సేవా ప్రతిభ అవార్డు?2026ను అందజేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు.జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ఆర్ టి ఐ సామాజిక కార్యకర్తగా సమాజ సేవలో రాపోలు లింగస్వామి చేస్తున్న కృషిని నిర్వాహకులు అభినందించారు. ప్రజా సేవ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని గుర్తించి ఈ పురస్కారాన్ని అందించినట్లు తెలిపారు.అవార్డుతో బాధ్యత మరింత పెరిగింది"ఈ సందర్భంగా రాపోలు లింగస్వామి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి సేవా ప్రతిభ అవార్డు?2026ను అందజేసిన ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు లభించిన



ఈ గౌరవం మరింత ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని అందించిందన్నారు.ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని, ప్రజా సమస్యలపై స్పందిస్తూ సమాజానికి తన వంతు సేవను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు. తన సేవలను గుర్తించి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.ఘనంగా నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలుఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ 24వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన అవార్డుల కార్యక్రమం సందడిగా సాగింది. కళలు, సామాజిక సేవ, జర్నలిజం తదితర రంగాల్లో సేవలందిస్తున్న ప్రతిభావంతులను ఈ సందర్భంగా గుర్తించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఇందిర ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎన్. ఇందిర, కార్యదర్శి ప్రసన్న, ఆరూరి ఆర్ట్ అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధులు, ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆలూరి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.ప్రజా సేవకు అంకితభావంతో ముందుకు సాగుతున్న రాపోలు లింగస్వామికి సేవా ప్రతిభ అవార్డు?2026 లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501**, PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**